క్లుప్తంగా

పామిడిలో మోస్తరు వర్షం



మడుగును తలపిస్తున్న మడికట్ల ఆంజనేయస్వామి వీధి

పామిడి: పామిడిలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షానికి లోతట్టు ప్రాంతాలైన మడికట్ల ఆంజనేయస్వామి వీధి, సీఎస్ఐ చర్చి–నూతన ఈద్గా వెనుక, మదీనా కాలనీ తదితర వీధులు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపార్లాయి. గుత్తి బీసీసీ రోడ్డు, మడికట్ల ఆంజనేయస్వామి వీధి మడుగును తలపించాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. కాగా ఈ వర్షంతో ఉక్కపోతతో అల్లాడుతున్న జనం ఉపశమనం పొందారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు.

చిత్తడిగా కూరగాయల మార్కెట్



మార్కెట్‌లోకి వెళ్లే రహదారి దుస్థితి

గుత్తి: పట్టణంలోని అంబేడ్కర్ కూరగాయల మార్కెట్ చిత్తడిగా మారింది. ఆదివారం కురిసిన చిన్నపాటి వర్షానికి మార్కెట్ చిత్తడిగా మారిపోయింది. కూరగాయల కొనుగోలు కొరకు మార్కెట్‌కు వస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో వినియోగదారులు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి కూరగాయల మార్కెట్‌లో చిత్తడిని, అపరిశుభ్రతను తొలగించాలని వ్యాపారులతో పాటు ప్రజలు కోరుతున్నారు.

పగలే ‘వెన్నెల’



ఓల్డ్ సీపీఐ కాలనీలో పట్ట పగలే వెలుగుతున్న వీధి దీపాలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని ఓల్డ్ సీపీఐ కాలనీలో ఆదివారం పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. రోజూ సాయంత్రం 6.30 గంటలకు వీధి దీపాలు వెలిగించి, ఉదయం 6 గంటలకు ఆఫ్ చేయాల్సి ఉంది. అయితే పర్యవేక్షణ లేక పగలు కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి పగలు వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

14న ‘కోన’లో వేలం

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయంలో వాహనాల పార్కింగ్ రుసుం వసూలు చేయడానికి ఈ నెల 14న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 11న రూ.5000 డిపాజిట్ (డీడీ) చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. 14వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు.

మందుబాబులకు అడ్డాగా క్రీడా మైదానం



పుట్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పగిలిన మద్యం బాటిళ్లు

పుట్లూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ ఆట స్థలాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ఆదర్శ పాఠశాల, కేజీబీవీలకు చెందిన విద్యార్థులు వినియోగిస్తుంటారు. అయితే మైదానంలో ఎక్కడ చూసినా మద్యం బాటిళ్లు, గాజు పెంకులు దర్శనమిస్తుండటంతో భవిష్యత్తులో విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మైదానంలో మద్యం సేవించకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మర్తాడు క్రాస్ సమీపంలో సొరంగంలా ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు



గార్లదిన్నె వద్ద రోడ్డుకు ఇరువైపులా ఎర్రని పూలు పూచిన వృక్షాలు

ఆహ్లాదకర ప్రయాణం

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నె నుంచి పెనకచెర్ల డ్యాంకు వెళ్లే రహదారి ప్రయాణం ఆహ్లాదకరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు చూపరులను ఆకర్షించడమే కాదు.. ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.ఇటీవల వర్షాలు కురవడంతో మండలంలో వివిధ గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు పచ్చదనం సంతరించుకున్నాయి. గార్లదిన్నె నుంచి పెనకచెర్ల డ్యాం వరకూ వెళ్లే ప్రయాణికులకు పచ్చని చెట్లు స్వాగతం పలుకుతున్నాయి. వికసించిన రంగురంగుల పుష్పాలు వెదజల్లే పరిమళం వారిని పలకరిస్తోంది. అలాగే గార్లదిన్నె, యర్రగుంట్ల సమీపంలో సొరంగంలాగా రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరగడంతో ప్రయాణికులు అక్కడ సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. మరి కొంతమంది ప్రయాణికులు రీల్స్ తీసుకుంటున్నారు.



యర్రగుంట్ల వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు

సింగిల్ విండో అధ్యక్షుడి రాజీనామా



సుంకిరెడ్డి

గుంతకల్లు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కె.సుంకిరెడ్డి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని గుత్తి సబ్ డివిజన్ అధికారి వీఏ. శ్రీనివాసులుకు పంపినట్లు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పరపతి సంఘం అభివృద్ధికి కృషి చేశానన్నారు. ఇన్నాళ్లూ తనకు సహకరించిన ఉద్యోగులు, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

తాడిపత్రి అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి ఉద్యోగ, ఉపాధ్యాయ, సామాజిక సేవా సంస్థ సభ్యులు ఆర్థికసాయం చేశారు. రాయలచెరువు గ్రామానికి చెందిన అబ్దుల్‌రజాక్ పక్షవాతంతో బాధపడుతూ కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బంది పడుతుండేవాడు. విషయాన్ని గమనించిన ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ బాధితుడు అబ్దుల్ రజాక్ తన వంతు సాయంగా రూ. 7,600 అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గుర్రప్ప, కన్వీనర్ శంకర్, ప్రెసిడెంట్ నాగభూషణం, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, కోకన్వీనర్ కరుణాకర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు బహుమతుల ప్రదానం



పాట పాడుతున్న చిన్నారులు

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఆరాధన కార్యక్రమంలో విరామ బైబిల్ స్కూల్ (వీబీఎస్) పిల్లలకు సంఘం ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. చివరిరోజు పిల్లల బైబిల్ కంఠత వాక్యాలు, దైవ సంకీర్తనాలాపనలు, స్కిట్స్, నృత్య ప్రదర్శనలు చూపరులను రంజింపజేశాయి. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ వీబీఎస్ పిల్లలకు బహుమతులతో ప్రోత్సహించారు. ఈసందర్భంగా ఆయన ప్రసంగించారు. పిల్లలను నాయొద్దకు రానీయ్యుడి, ఇలాంటి వారిదే పరలోక రాజ్యమని యేసుక్రీస్తు ప్రబోధించారన్నారు. చిన్నప్పటి నుంచి పిల్లల్లో దైవిక జ్ఞానాన్ని పెంపొందించి, వారిని సన్మార్గంలో పయనింపజేయడానికి ఇలాంటి విరామ బైబిల్ పాఠశాలలు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, పిల్లలు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



యర్రగుంట్ల వద్ద ఇంద్రధనుస్సు

● ఆకాశంలో హరివిల్లు..

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో ఆదివారం సాయంత్రం ఆకాశంలో ఏర్పడిన ఇంద్ర ధనుస్సు చూపరులను కనువిందు చేసింది. ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. వర్షం వెలసిన అనంతరం ఆకాశంలో ఇంద్ర ధనుస్సు ఏర్పడింది. సుమారు 20 నిమిషాలు పాటు ఉన్న ఇంద్ర ధనుస్సు ఆకట్టుకుంది.

వైభవంగా కల్కి అమ్మభగవాన్ కల్యాణోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డులోని కల్కి ఆలయంలో కల్కి అమ్మభగవాన్ కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. కల్కి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భగవతి, భగవానుల చిత్రపటాలను అలకరించి, కల్యాణోత్సవ వేడుక జరిపించారు. వందలాది మంది భక్తులు హాజరుకాగా, కల్యాణోత్సవాన్ని జరిపారు. లోక కల్యాణార్థం ఏటా కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సేవకులు జయంతి రమేష్, నరసింహప్రసాద్, ఎస్ఎల్‌వీ రాధాకృష్ణ, లతా, లలిత, గీతా లక్ష్మీ, కౌన్సిలర్ దేవరాజు, రాఘవేంద్ర తెలిపారు. అధిక సంఖ్యలో దంపతులు హాజరై సంతాన ప్రాప్తి, సంపూర్ణ ఆరోగ్యం కోసం పూజలు చేశారు.

బీజేపీ సంబరాలు

గుంతకల్లు: వరుసగా మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకరం చేసిన సందర్భంగా పట్టణ బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. పాత గుంతకల్లులోని అంకాలమ్మ గుడి సమీపంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి జేసీ వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, సీనియర్ నాయకులు పసుపుల హరిహరినాథ్, పురంధర్, మహిళ మోర్చా నాయకురాలు శ్రీదేవి తదితరుల నేతృత్వంలో స్వీట్లు పంచుకున్నారు. వారు మాట్లాడుతూ మోదీ పరిపాలనకు ఫిదా అయిన ప్రజానీకం మరోసారి పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిన్న కళావతి, మునిరాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక చరిత్రల అధ్యయనం ఉపయుక్తం

అనంతపురం కల్చరల్: నొళంబుల చరిత్రను రికార్డు చేయడం ఒక సాహసోపేతమైన ప్రయత్నమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి కొనియాడారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సిద్ధగిరి శ్రీనివాస్ రచించిన నొళంబవాడి పుస్తక పరిచయ సభ జరిగింది. జిరసం అధ్యక్షుడు డాక్టర్ జెన్నే ఆనంద్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బండి నారాయణ స్వామి, సత్యసాయి జిరసం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, అడవాళ శేషగిరి నాయుడు, బండి నాగరాజు, పోతుల రాధాకృష్ణ, పుస్తక సమీక్షకుడు డాక్టర్ అంకె శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. మడకశిర ప్రాంతానికి చెందిన రచయిత సిద్ధగిరి శ్రీనివాస్ తన స్థానిక చరిత్రను రికార్డు చేయడంలో సఫలీకృతులయ్యారన్నారు. అదే స్ఫూర్తిని అందరూ కొనసాగించాలని వక్తలు సూచించారు. చరిత్ర అధ్యయనం నానాటికి కుంటుపడుతుండటం విచారకరమన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సునిశితమైన పరిశీలన జ్ఞానం గొప్ప పుస్తకానికి తొలి మెట్టుగా మారిందని రచయితను పలువురు కొనియాడారు. అదేవిధంగా సిద్దగిరి శ్రీనివాస్ ఆసక్తికరమైన జిల్లా చరిత్ర విశేషాలను తెలియజేసి ఆకట్టుకున్నారు. ఒక మహా సామంత రాజ్యపు చరిత్రను కళ్లకు కట్టినట్టు వివరించారు. అనంతరం జిరసం కార్యవర్గంతో కలిసి ఎలేట్రపీ అధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, అమరనాథరెడ్డి, వన్నప్ప, నబీరసూల్, రియాజుద్దీన్, షరీఫ్, చేగువేరా హరి, అలీఖాన్ రచయితను ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి విత్తన కందులకు రిజిస్ట్రేషన్



శింగనమల: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం నుంచి విత్తన కందుల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అన్వేష్‌కుమార్ తెలిపారు. నాలుగు కిలోల విత్తన కందులు రూ.392కు అందిస్తామన్నారు. రైతులు ఆర్‌బీకేల్లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

అంతర పంటగా కంది సాగు చేయండి

గార్లదిన్నె: ఖరీఫ్‌లో రైతులు వేరుశనగ పంటలో అంతర పంటగా కంది సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సూచించారు. ఆదివారం ఏఓ మాట్లాడుతూ రైతులు వేరుశనగ పంట సాగులో అంతర పంటగా కంది సాగు చేయడంవల్ల ప్రధాన పంట దిగుబడి తగ్గినా కంది పంటలో దిగుబడి పొందవచ్చన్నారు. అలాగే ప్రభుత్వం మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాల్లో ఎల్ఆర్‌జీ–52 రకం కందులు 30 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తుందన్నారు. సబ్సిడీ పోనూ రైతు రూ.392 చెల్లించాలన్నారు. విత్తన కందులు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గుత్తికి చెందిన శ్రీరాములు ఆటోలో వెనుక కూర్చొన్నాడు. అయితే ప్రమాదవశాత్తు జారి కిందపడి గాయపడ్డాడు. స్థానికులు అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పశువులకు టీకా వేయించండి

గార్లదిన్నె: పశువులకు వ్యాధులు రాకుండా పాడి రైతులు వ్యాక్సిన్ వేయించాలని మండల పశువైద్యాధికారి రమేష్ సూచించారు.ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వాతావరణ మార్పులు వల్ల పశువులకు వివిధ రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పశువైద్య సిబ్బంది గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా వ్యాక్సిన్లు వేస్తున్నారన్నారు. గాలి కుంటు వ్యాధి సోకితే పశువు ఆరోగ్యం క్షీణించి పాల దిగుబడి తగ్గుతుందన్నారు. అలాగే వ్యాధి ప్రభావం ఎక్కువైతే పశువులు మృతి చెందే అవకాశం ఉందన్నారు. మండలంలోని పాడి రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు.

యల్లనూరు: మూగజీవాలకు రైతులు గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలని పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి ఏడీ ఖాదర్‌బాషా, లైవ్ స్టాక్ అసిస్టెంట్ రేష్మ సూచించారు. ఆదివారం వారు మాట్లాడుతూ యల్లనూరు పశుసంవర్ధక ఆస్పత్రి పరిధిలో 1500 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. అలాగే 1000 గొర్రెలు, మేకలకు చిటిక రోగం (ఈటీ) వ్యాక్సిన్ వేశామన్నారు.

నారాయణస్వామీ నమోస్తుతే..



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సింగరపట్టు, గణపతి అశ్వత్థ నారాయణుడు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపాన పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థ క్షేత్రానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. భక్తులు నారాయణ స్వామి, శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, భీమలింగేశ్వరస్వామి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామికి ముడుపులు, కానుకలు, తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అర్చకులు బాలసుబ్రమణ్య శర్మ, సుధీర్‌కుమార్‌శర్మ, సునీల్‌కుమార్‌శర్మ ఆలయ విశిష్టతను వివరించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రతి ఆదివారం క్షేత్రానికి ఎక్కువ మంది భక్తులు తరలి వస్తుంటారని ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్రమణ్యం తెలిపారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి క్షీరాభిషేకం



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు, మహా నైవేద్యం నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

పెద్దమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



అలంకరణలో యల్లనూరు పెద్దమ్మ



కొడవండ్లపల్లి పెద్దమ్మ

యల్లనూరు: మండలంలోని యల్లనూరు, కొడవండ్లపల్లిలో వెలసిన పెద్దమ్మ అమ్మవార్లకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అమ్మవార్లకు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వరకూ భక్తులు విరివిగా హాజరయ్యారు. తీర్థ ప్రసాదాలను అందుకుని అమ్మవారి సేవలో పాల్గొన్నారు. అలాగే చిలమకూరు ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

నోటాకు ఓటు.. 18 మందికి డిపాజిట్ గల్లంతు



తాడిపత్రిలో ఓటు వేస్తున్న ప్రజలు (ఫైల్)

తాడిపత్రిటౌన్: తాడిపత్రి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నోటాకి వెయ్యి మంది ఓటు వేసి అభ్యర్థులపై తమ వ్యతిరేక అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. నియోజకవర్గంలో 18 మంది అభ్యర్థులు పోటీలో నిలువగా 16 మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓటు వచ్చాయి. అలాగే వారందరూ డిపాజిట్లు కూడా దక్కించుకోకపోవడం గమనార్హం. ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీకి ప్రజలు పోటాపోటీగా ఓట్లు వేసారు. కాంగ్రెస్ అభ్యర్థి సహా మిగిలిన అభ్యర్థులు అందరూ నామమాత్రంగానే ఎన్నికల బరిలో నిలిచినట్లైంది. నియోజకవర్గంలోని పెద్దవడుగూరు, యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి, తాడిపత్రి అర్బన్‌లో 2,06,701 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డికి 86,024 (41.66శాతం) ఓట్లు రాగా టీడీపీ అభ్యర్థి అస్మిత్‌రెడ్డికి 1,13,755 (55శాతం) ఓట్లు వచ్చాయి. అలాగే నోటాకు 1000 మంది ఓటు వేశారు. వాటిలో ఈవీఎంల ద్వారా 983 మంది, 17 మంది పోస్టల్ ద్వారా ఓటేసారు. కాగా మిగిలిన 16 మంది అభ్యర్థులకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే బీఎస్పీ–420 , భారత చైతన్య యువజనపార్టీ –153, ఆంధ్రరాష్ట్ర ప్రజాసమితి– 784, జైభారత్ నేషనల్ పార్టీ–130 ఓట్లు, సమాజ్‌వాదిపార్టీ – 75, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ–105, జై భీమ్‌రావ్ భారతపార్టీ–132, రాష్ట్రీయ సమాజ్‌దళ్ పార్టీ– 98 ఓట్లు సాధించాయి. స్వతంత్ర అభ్యర్థుల్లో ఆకుల నాగరాజు–115, కంబగిరి రాముడు– 138, చంద్రఓబుళరెడ్డి– 107, పెద్దిరెడ్డి–243, రామబసవరెడ్డి– 636, రామినేని రామమోహన్– 752, సోమశేఖర్‌నాయుడు 383 ఓట్లు సాధించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుజ్జల నాగిరెడ్డికి 2,628 ఓట్లు పోలయ్యాయి. డిపాజిట్ దక్కాలంటే మొత్త పోల్ అయిన ఓట్లలో 6 శాతం ఓట్లు రావాలి. దీంతో 18 మంది అభ్యర్థుల్లో ప్రధాన రెండు పార్టీ అభ్యర్థులకు తప్పితే మిగిలిన 16 మంది అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతయ్యాయి.